# అమ్మకావాలి

-యం.ఉదయభాను

దూరంగా ఎక్కడో చర్చి గంట మ్రోగింది.
రాత్రి ఒంటిగంట అయిందన్నట్టుగా.
ఫోమ్ బెడ్‌పై పడుకున్నానే కాని నిద్రపట్టడం లేదు.
గదిలో ఏ.సి చల్లగాలి వీస్తున్నా నాకు మాత్రం ఉక్కగా ఉంది.
మెదడు నిండా గజిబిజి ఆలోచనలు. అంత ఇదిలోనూ
''పరుపులున్నా పట్టదు నిదుర
కరకు నేలన గురకలు వినరా..'' అన్న ఓ మహాకవి పాట గుర్తుకు వచ్చి నవ్వొచ్చింది.

నిజమే మరి. ఎన్ని రాత్రులు ఫుట్‌పాత్‌ల పైనా, రైల్వే ప్లాట్ ఫారాలపైనా గడిపాను. నా జానెడు పొట్టకోసం ఒళ్ళలిసేలా పనిచేసి నేలమీద తల ఆన్చగానే నిదురమ్మ ఒడిలో ఆదమరిచి నిదుర పోయేవాణ్ణి. మరి ఈనాడు లంకంత బంగళా, కార్లు, నౌకర్లు నా కనుసన్నలలో తిరిగే పి.ఏ లు, పట్టుపరుపులు అయినా హాయిగా నిదురపోలేకపోతున్నా, నన్నింతగా కృంగదీసే సంఘటన ఈరోజు ఉదయం 'తల్లి ప్రేమ' సినిమా షూటింగ్‌లో జరిగింది.

నేను తల్లి ఒడిలో నిదురించే సీను తాలూకు షూటింగ్ జరుగుతోంది. నాది అమాయకుడి పాత్ర తల్లిపాత్రధారిణి సరళ ఓ సీనియర్ నటి. సీన్ ప్రకారం ఆవిడ నాపై అవాజ్యమైన ప్రేమను కురిపిస్తూ భారీ డైలాగులు వల్లిస్తోంది. నేను ఆమె కళ్ళల్లోకి చూస్తూ ''అమ్మా...'' అనాలి.

అప్పుడు జరిగిందది. ఆమె కళ్ళల్లోకి చూడగానే నా గుండెలోతుల్లోంచి తన్నుక వచ్చిందొకకేక. పాతిక సంవత్సరాలుగా అమ్మ అన్న పదాన్ని మరచిపోయిన నా మస్తిష్కం నుండి తొలుచుక వచ్చిందా కేక. ''అమ్మా...'' అని.

డైరెక్టర్ 'కట్' అన్నాడు. అయినా ఆమెను గట్టిగా పట్టుకొని భోరుమని ఏడ్చాను. నాచుట్టూ ఉన్న వాళ్ళు నన్ను ఆమె నుండి విడదీసారు.

''పతీ..వ్వాట్ హాపెన్డ్..?'' ఇది కామెడీ సీన్ కాదు. సీరియస్ సీన్'' డైరెక్టర్ అడుగుతున్నాడు. నా మూడ్ బాగాలేదని గ్రహించి షూటింగ్‌కు ప్యాక్ అప్ చెప్పారు డైరెక్టర్.

నా పి.ఏ కారు రడీ చేసాడు. కారులోనే నా మెదడుకు వచ్చిన ఆలోచన నా పి.ఏకు చెప్పాను. అలాగేసార్ అంటూ నా ఆలోచన అమలు చేయడానికి గాను దారిలోనే దిగిపోయాడు నా పి.ఏ.

ఎప్పుడు తెల్లవారుతుందా అని ఆత్రంగా ఎదురుచూస్తున్నాను. గడియారం ఆరుగంటలు కొట్టింది. గబగబా హాల్లోకి వచ్చాను. నా పి.ఏ. ఆరోజు ఉదయం తెలుగు, ఇంగ్లీష్ పేపర్లన్నీ పట్టుకొచ్చాడు.

ఆత్రంగా చూసా అన్ని పేపర్లలోనూ మొదటి పేజీలోనే ఉందా ప్రకటన. వాటిని తీసుకొని బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి వాలిపోయా. మరోసారి తృప్తిగా చూసుకొన్నా.

''అమ్మకావాలి... ఎక్కడున్నా ఈ క్రింది అడ్రసుకు రావలెను'' అని ఉంది. నాకు తెలియకుండానే ఓ విషాద దరహాసం నా మొహాన మెరిసింది. ''భగవాన్ ఏ కొడుక్కీ ఇలాంటి పరిస్థితి రాకూడదు'' చేతులెత్తి మొక్కాను. గతం తాలూకు ఆలోచనల జడివాన తగ్గలేదు.

★★★

ఎక్కడో ఓ పల్లెటూళ్లో ఓ దుర్ముహూర్తాన నా తల్లి నాకు జన్మనిచ్చింది.

కొంతమంది పుట్టుకతోనే అదృష్టం వెంట తెచ్చుకుంటారు. మరికొంతమందికి పుట్టకముందే దురదృష్టం వాళ్ళకై ఎదురుచూస్తుంటుంది. ఆ రెండో తెగకు చెందిందే నా పుట్టుక.

**కిటికీలోనుండి నన్ను చూసిన కొంతమంది పిల్లలు కిలకిలా నవ్వసాగారు. మరికొంతమందైతే నావైపు రొట్టిముక్కలు డబ్బులు విసిరేయసాగారు. నాకు తెలియకుండానే వాటిని ఏరుకోసాగాను నేను. రైలు నెమ్మదిగా కదలసాగింది. మళ్ళీ నాకు నా ఒంటరితనం తాలూకు దిగులు ఆవహించసాగింది.**

పుట్టగానే కళ్ళు తెరచి అమ్మకేసి ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటుందేమోనని చూసా. నా ఊహలు తారుమారు చేస్తూ నావైపు అసహ్యంగా చూస్తూ తల తిప్పేసుకొంది. అలా పొత్తిళ్ళ నాటి నుండే అమ్మ ఒడికి దూరంగా నా పెరుగుదల సాగింది. అప్పటి నా చిన్న మెదడుకు అమ్మ నన్నెందుకు అసహ్యంగా చూస్తుందో అర్థం కాలేదు.

కన్న తల్లే నన్ను ఛీత్కరించినపుడు ఎవరుమాత్రం నాపై దయ చూపిస్తారు. కొంతలో కొంత నయంగా మా నాన్న మాత్రం నాపై జాలో దయో గాని నన్ను చేరదీస్తుండేవాడు.

నాకు మూడేళ్ళ వయసప్పుడు నాకో చెల్లి పుట్టిందని తెలిసింది. ఇంట్లో అంతా హడావిడి పండగ సంరంభం కనిపించింది. అమ్మా నాన్న కొత్తబట్టలు వేసుకొన్నారు. నన్నుమాత్రం అందరితో కలవకుండా ఓ గదిలో వేసి బంధించారు. ఇంక ఆ రాత్రంతా తలుపు తీయలేదు. బాధతోనే, భయంతోనే తెలియలేదు. సొమ్మసిలి పడిపోయాను. కళ్ళు తెరిచేసరికి బారెడు పొద్దెక్కినట్టు కిటికీలో నుండి ఎండకాస్తోంది. గది బయట నాన్న గొంతు వినిపిస్తోంది.

''రాజీ తలుపుతీద్దాం. పసివాడు బెంగ పెట్టుకుని ఉంటాడు'' అన్నాడు. తలుపునకు ఆనుకొని ఆశగా అమ్మ ఏమంటుందో వినసాగా. అప్పుడు ఆమె అన్నమాటలు ఆ పసి వయసులోనే నా గుండెను తూట్లు పొడిచాయి.

''పోనీయండి. దిక్కుమాలిన సంత. కోతిమొహం వాడూనూ. వాడుపోతే భూమికేం నష్టం లేదు. భూ భారం కొంత తగ్గుతుంది'' పిడుగుల్లాంటి మాటలు ఆమె నోటి నుండి వెలువడ్డాయి. నాన్న తలుపు తీసాడు. అక్కడ అమ్మలేదు. నాన్నను వాటేసుకొని వెక్కి వెక్కి ఏడ్చాను. జాలిగా నా మొహం తుడిచి నన్నెత్తుకున్నాడు నాన్న.

అమ్మ నన్నెందుకు అసహ్యించుకుంటుందో నాకర్థం కాలేదు. ఆ వయసులో నాతో ఆడుకోడానికి ఎవ్వరూ వచ్చేవారు కారు. ఇద్దరు నేస్తాలు మాత్రం ఎప్పుడూ నన్నంటిపెట్టుకొని ఉండేవారు. అవి మొదటిది దుఃఖం అయితే రెండోది ఒంటరితనం.

★★★

ఇంకో రెండు సంవత్సరాలు గడిచాయి అంటే నాకు అయిదేళ్ళు వచ్చాయి.


ఆరోజు ఇంట్లో వాళ్ళంతా ఎక్కడికో ప్రయాణమవుతున్నారు. నాన్న, నన్ను చేరదీసి స్నానం చేయించి బట్టలు వేసి తయారుచేసాడు. అందరం బయలుదేరి రైలెక్కాం. నాకైతే చెప్పలేనంత సంబరంగా ఉంది. కిటికీ ప్రక్కన కూర్చున్నా. నాన్న నా పక్కన కూర్చున్నాడు. చెల్లి అమ్మ ఒళ్ళో హాయిగా పడుకొని ఉంది. కదులుతున్న రైలు కిటికీలో నుంచి చెట్లను, పొలాలను, టెలిఫోన్ స్థంభాలను చూస్తుంటే ఏదో చెప్పలేని దిగులు ఆవహించింది నాకు.

వాటిని మళ్ళీ చూడగలనో లేదో అని అవి చుక్కల్లాగా కనిపించేంత దూరం వరకు చూస్తూ కూర్చున్నాను. చీకటి పడింది అలాగే నాన్న ఒళ్ళో నిద్రపోయాను.

ఓ అర్ధరాత్రి నాన్న నన్ను భుజాన వేసుకొని దిగుతుంటే మెలుకువ వచ్చింది. ''మనం దిగాల్సిన స్టేషన్ వచ్చిందా నాన్నా'' అమాయకంగా అడిగాను. నాన్న ఏం

మాట్లాడకుండా నిర్మానుష్యంగా ఉన్న ఆ స్టేషన్‌లోని రైలుకు మరోపక్క ఉన్న ప్లాట్‌ఫారమ్ పైకి నన్ను తీసుకెళ్ళి అక్కడ ఉన్న బెంచీపై కూర్చోబెట్టాడు.

తన రెండు చేతుల్లోకి నా మొహాన్ని తీసుకొని ''కన్నా...'' అని గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు. అప్పుడు చూసా నాన్న కళ్ళల్లోనీళ్ళు. నా చిట్టిచేతులతో నాన్న కళ్ళు తుడిచి ''ఎందుకు నాన్నా ఏడుత్తున్నావు..?'' అని అడిగా. ఆయన ఏం మాట్లాడలేదు. మౌనంగా నా చేతుల్లో రెండు బన్ను ముక్కలు పెట్టి ''ఇక్కడే కూర్చో అమ్మా వాళ్ళను తీసుకొస్తా'' అంటూ రెండడుగులు ముందుకేసి మళ్ళీ ఏదో గుర్తుకొచ్చిన వాడిలా వెనక్కి వచ్చి తన మెడమీద ఉన్న మఫ్లర్ నా తలకి చుట్టాడు. నా జేబులో రూపాయినోట్లు పెట్టి తలొంచుకొని గబగబా అడుగులేస్తూ వెళ్ళిపోయాడు.




నేను నాన్న చెప్పిన స్థలంలోనే కదలకుండా కూర్చొని రైలు వైపు చూస్తూ కూర్చున్నాను.

ఇంతలో మరోవైపు ఉన్న ఎర్రలైటు పచ్చగా మారింది. నా చెవులు గళ్ళు పడేలా ''కూ...'' అని కేకవేస్తూ రైలు కదిలింది. నాన్న వాళ్ళు రైలు కదిలిం తరువాత వస్తారని ఆశగా చూసాగా. నా ఆశ నిరాశగా మారడానికి ఎక్కువ సేపు పట్టలేదు. కళ్ళు చిట్లించి చీకట్లో చూడసాగా ఎవ్వరూ రాలేదు. చుట్టూ చీకటి స్టేషన్‌లో బెంచీపై నేను ఒక్కణ్ణే.

నా నేస్తాలు నాతోటే ఉన్నారు. అదే దుఃఖం, వంటరితనం. అలా ఎన్నిగంటలు కనురెప్పవేయకుండా చూస్తూ కూర్చున్నానో తెలియదు.

ఏం జరిగిందో మీకు అర్థమయ్యే ఉంటుంది.

★★★

అలాగే తెల్లవారింది. అదేదో మారుమూల పల్లెటూరు అనుకుంటా. ఆ స్టేషన్‌లో పెద్దగా జనసంచారం లేదు. ఇంతలో నేను కూర్చున్న ప్లాట్ ఫారంపై ఏదో రైలు ఆగింది.

కిటికీలోనుండి నన్ను చూసిన కొంతమంది పిల్లలు కిలకిలా నవ్వసాగారు. మరికొంతమందైతే నావైపు రొట్టిముక్కలు డబ్బులు విసిరేయసాగారు. నాకు తెలియకుండానే వాటిని ఏరుకోసాగాను నేను. రైలు నెమ్మదిగా కదలసాగింది. మళ్ళీ నాకు నా ఒంటరితనం తాలూకు దిగులు ఆవహించసాగింది.

అప్పుడు ఒకతను ఆ రైలు దిగి నా దగ్గరకు వచ్చి నిల్చున్నాడు. అతని చేతిలో ఓ కోతి పిల్ల ఉంది. అతన్ని చూడగానే బావురుమని ఏడ్చాను. అతనికి కూడా ఏమనిపించిందో నన్ను తన గుండెల మీదకు ఎత్తుకున్నాడు. అతను నా చెంపలు తుడిచి ''నిన్నీడెవరు దింపింద్రు బిడ్డా..?'' అని అడిగాడు.

నాకు తెలిసినంతవరకు నా గురించి అంతా వివరించాను.

అంతా విన్న అతను ఆకాశం వైపు చూస్తూ ''భగవంతుడా...నువ్వు ఉన్నావో లేదో నాకు తెలియదు కాని కన్నబిడ్డను నట్టడివిలో వదిలేసే తల్లిదండ్రులను మాత్రం సృష్టించకు స్వామీ'' అంటూ దండం పెట్టాడు.

నన్ను ఎత్తుకొని ''ఇంక నీకు అమ్మా నాన్న అన్నీ నేనే'' అంటూ అక్కున చేర్చుకున్నాడు. నాకు తెలియకుండానే అతన్ని గట్టిగా పట్టుకున్నాను. అతను నవ్వుతూ ''బయపడకు బిడ్డా నిన్నేడ వదిలిపెట్ట. నాకు సదువు, నాగరీకం తెలియక పోయినా పసిపిల్లలను వదిలేసే రాక్షసుణ్ణి మాత్రం కాను. నా ప్రాణం ఉన్నంతవరకు నిన్ను నాతోనే ఉంచుకుంటాను'' అన్నాడు. అతని పక్కనున్న కోతి స్నేహపూర్వకంగా నావైపు చేయి చాచింది. నేను కూడా సెకండిచ్చా.

''నీ పేరు..?'' అడిగాడు.

''గణపతి..'' అని చెప్పా. అతని పేరు మరిడయ్య.

నాకు తెలియకుండానే అతన్ని ''అయ్యా...'' అని పిలవసాగా.

అతన్ని నేనడిగిన తొలిప్రశ్న ''అయ్యా అందరూ నన్ను చూసి ఎందుకు నవ్వుతారు?'' అని అడిగాను.

నన్ను తన ఒళ్ళో కూర్చోబెట్టుకొని ''నువ్వు దేవుడివయ్యా...నలుగురిని నవ్వించే అదృష్టం అందరికీ రాదు. ఈ మనుషులకు ఎదుటవాణ్ణి ఏడిపించడమే చాతనవును కాని నవ్వించటం తెలియదు'' అంటూ నాముందర ఓ అద్దాన్ని ఉంచాడు. నిజమే నా మొహం నాకే నవ్వు పుట్టిచ్చేలాగుంది.

నల్లటి నా మొహానికి లావుముక్కు ఎత్తుపళ్ళు విచిత్రంగా ఉంది. నన్ను చూసి ఎందుకు నవ్వుతున్నారో అప్పుడు అర్థమయింది. మరి అయ్య చెప్పినట్టు అందరిని నవ్వించే నన్ను చూసి అమ్మ గర్వపడాలి కాని ఎందుకలా బాధ పడుతుందో నాకు అర్థం కాలేదు. అయ్య నన్ను తనతో తీసుకెళ్ళాడు.

★★★

రోజూ అయ్యతో కలిసి ఊరంతా తిరిగేవాళ్ళం. అయ్య చేత్తో డప్పు వాయిస్తుంటనే నేను, హనుమంతు ఇద్దరం డాన్స్ చేసేవాళ్ళం. జనం సంతోషంతో చప్పట్లు కొడుతూ డబ్బులు విసిరేవారు. వాటితో మా జీవన భృతి గడిచేది.

ప్రకృతిలో దేనినైనా అదుపు చెయ్యొచ్చుగాని కాల ప్రవాహాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరు. ఓ ఇరవై సంవత్సరాలు గడిచాయి. అయ్య పెద్దవాడైపోయాడు.

★★★

ఓ రోజు తిరుపతిలో అలిపిరి దగ్గర మేం మా ప్రదర్శన ఇస్తున్నాం. ఆ పక్కనే ఏదో సినిమా షూటింగ్ జరుగుతోంది. షూటింగ్ విరామ సమయంలో డైరెక్టర్ ఎవ్వరో మా ప్రదర్శన చూసి నన్ను పిలిపించారు. సరదాగా నేను వాళ్ళ దగ్గరకు వెళ్ళాను. వాళ్ళంతా నా గురించి ఏదో చర్చించుకొని ''సినిమాలో వేషం వేస్తావా..?'' అని అడిగారు. నేను ఊ కొట్టాను.

నలుగురు కమెడియన్ల మధ్య పది నిమిషాల పాత్ర అది. ఆ సినిమా విడుదలయింది. అయితే నా ఆకారం చూడగానే నవ్వుపుట్టించేలా ప్రత్యేకంగా ఉండటంతో ప్రేక్షకులు నాపాత్రను బాగా గుర్తుంచుకున్నారు. ఆ వెంటనే మరో అరడజను సినిమాల్లో విలన్ ప్రక్కన ఉండే కమెడియన్ పాత్రలు వచ్చాయి.

ఆ తరువాత ఓ డాన్స్ డైరెక్టర్ హీరోగా వేషం వేస్తున్నాడు. అయితే సదరు హీరోగారు స్ప్రింగులా డాన్సులైతే చేయగలడు కానీ పెద్ద అందగాడు మాత్రం కాదు. అతని ప్రక్కనే స్నేహితుడి వేషంకు ఓ కామెడి యాక్టరు కావలసి ఉంది. అయితే ఆ పాత్రధారి హీరోగారికంటే అందవికారంగా ఉండాలి.

తొలిసారి జీవితంలో నా వికార స్వరూపం నాకు అదృష్టంగా పరిణమిల్లింది. ఆ పాత్ర పోషించడం ద్వారా నా దశ తిరిగింది. వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం కలుగలేదు. కార్లు, బంగళా బ్యాంక్ బ్యాలెన్స్ వీటితోపాటు పాపులారిటీ అన్నీ సమకూరాయి.

అయితే నా గత జీవితం మరిచిపోకుండా అయ్య నా చేత నా బంగళా ఆవరణలోనే ఓ 'దేవాలయం' నిర్మింపజేసాడు. నేనెంత బిజీగా ఉన్నా రోజూ ఓ అరగంట అక్కడ గడిపితే కాని నాకు మనశ్శాంతి ఉండేది కాదు. మూడు సంవత్సరాల్లో నూట యాభైకి పై చిత్రాల్లో నటించా. ఇప్పుడు నాకు డబ్బుకు కొదవలేదు.

భగవంతుడు ఎప్పుడూ నన్ను గర్వంగా తలెత్తుకోనివ్వలేదు. ఎప్పటికప్పుడు మొట్టికాయలు వేస్తూనే ఉన్నాడు. నా ఉనికికి ప్రాణం పోసిన మరిడయ్య మరణించాడు. మళ్ళీ నా ఒంటరితనం నాకు మిగిలింది. ఈరోజు అమ్మా నాన్న జ్ఞాపకం వచ్చారు. అందుకే ఈ ప్రకటన ''అమ్మ కావాలి'' అని.

ప్రకటన వెలువడ్డ వారం రోజుల తరువాత ఇంటర్వ్యూ ఏర్పాటు చేసా. చూడాలి డబ్బు చేసే మ్యాజిక్.

★★★

నా అంచనా తప్పుకాలేదు. నాకు సుమారు నలభై మంది అమ్మ లొచ్చారు. వాళ్ళందరిని ఓ హాల్లో కూర్చోబెట్టి ఒక్కొక్కర్నే నా ఆఫీసు రూమ్‌కి పంపించసాగాడు నా పి.ఎ.

వాళ్ళల్లో చాలామంది తమ కడుపులో ప్రేమ లేకున్నా కన్నీళ్ళుకారుస్తూ ఎనలేని ప్రేమ నాపై కురిపించసాగారు. నాకు మనసులో తెగ నవ్వొస్తోంది. అనురాగానికి మారుపేరైన అమ్మ ప్రేమలో ఇంత కల్తీయా, హే భగవాన్!

అయితే వాళ్ళను నేను కించపరచ దలచుకోలేదు.

వాళ్ళను నా కాంపౌండ్‌లో ఉన్న 'దేవాలయాన్ని' చూపించి దాని బాధ్యత కూడా మీరే నిర్వహించాలి అన్నాను. ఆ మాట వినగానే చాలామంది పెడమొహం పెట్టారు. వాళ్ళల్లో నా కన్నతల్లి కూడా ఉంది.

ఎందుకంటే ఈ గ్లామర్ ప్రపంచానికి నా పేరు కేవలం 'పతి' అని మాత్రమే తెలుసు. నా తల్లి కనుకే నన్ను 'గణపతి' అని పిలిచింది. ''నాన్న ఎక్కడ..?'' అని అడిగాను. నామీద బెంగతో నాన్న మంచం పట్టాడట. నన్ను మరిపించడానికి డాక్టర్ సలహా లేకుండానే అమ్మ నిద్రమాత్రలు వేసి వేసి ఆయన బుర్రపాడుచేసి పిచ్చివాణ్ణి చేసి పిచ్చాసుపత్రిలో చేర్పించిందంట. అది వినగానే నా కళ్ళల్లో కన్నీళ్ళొచ్చాయిగాని మా అమ్మ గురించి నా నోటి నుండి ఒక్క పరుషమైన మాట రాలేదు. ఎదుటి మనిషిని నొప్పించేలా మాట్లాడలేకపోవడం నా బలహీనత. బహుశా ఇతరులకి అది నా చేతకానితనంగా అనిపించొచ్చు. మా నాన్న వివరాలు తెలియగానే ఫోన్లమీద నిమిషాల్లో మా నాన్నను నా దేవాలయంలోకి చేర్పించా. అదీ నా డబ్బుకున్న పలుకుబడి. అందరిని అడిగినట్లుగానే ఆమెను కూడా 'దేవాలయం' బాధ్యత స్వీకరించాలని చెప్పాను. ఇక్కడ ఆమె నిజాయితీని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. నిర్మొహమాటంగా ఉండలేనని చెప్పింది. వెంటనే ఓ బ్లాంక్ చెక్ ఆమె చేతికి ఇచ్చి దండం పెట్టి.

''నువ్వు ఇక్కడ ఉంటావనుకోవడం నాదే బుద్ధి తక్కువ. అనాకారి అయిన ఒక్క నన్నే సహించలేకపోయావు. ఏదో డబ్బుకోసం మనసు చంపుకొని ఇక్కడికొచ్చావు. ఈ 'దేవాలయం'లో నాలాంటి చిన్నారులు వంద మందికి పైగా ఉన్నారు. అనాకారులుగా, బుద్ధి మాంద్యంగల పిల్లలుగా పుట్టడం ఆ పిల్లల చేతిలో లేదు. కన్నతల్లిదండ్రుల అనాదరణకు గురైన అభాగ్యులను ఆదుకోవడం నా ధర్మంగా ఎంచి ఆ చిన్నారులను ఇక్కడకు చేర్చా.

వీళ్ళంతా నాదృష్టిలో ప్రత్యక్షదైవాలు. ఆ దైవాలకు అమ్మవయ్యే అవకాశం నీకు లేదు. వెళ్ళమ్మా వెళ్ళు'' అని చెప్పి గబగబా అక్కడి నుంచి బయలుదేరి 'దేవాలయం' లో అడుగు పెట్టా. అక్కడి దృశ్యం చూసిన నా గుండె ద్రవించి నాకళ్ళ నుండి అశ్రువులుగా స్రవించసాగింది.

అమాయకంగా ఉన్న పసిపువ్వుల్లాంటి వాళ్ళంతా నాన్న చుట్టూ చేరారు. కొందరు నాన్న ఒళ్ళో, కొందరు నాన్న వీపుపైనా, మరికొందరు నాన్న తలపైనా కూర్చుని నాన్న చెప్పే కథలు సంతోషంగా వింటున్నారు. నాకెంతో తృప్తిగా అనిపించింది.

కానీ నా ఆశ చావకుండా ఇంకా రోజూ పేపర్లో ప్రకటన ఇస్తూనే ఉన్నా 'అమ్మకావాలి' అని. ఎందుకంటే ఈ లోకంలోని మంచితనం మీద ఇంకా నమ్మకం ఉన్నవాణ్ణి నేను. ★



## బాబీ డిమాండ్!

ధర్మేంద్ర రెండో కుమారుడు బాబీ నటించిన తొలి చిత్రం అట్టర్ ఫ్లాప్. ఆ తర్వాత గుప్త్, ఔర్ ప్యార్ హోగయా చిత్రాలు కూడా పరాజయం పాలయ్యాక 'సోల్జర్' చిత్రం సూపర్ హిట్టయింది. అంతే బాబీ ఇంటి ముందు నిర్మాతల క్యూ పెరిగిపోయింది. దాంతో బాబీ కూడా తన రేటుని అమాంతం పెంచేశాట్ట. నిన్నమొన్నటి వరకు 40 లక్షలకి మించి తీసుకోని బాబీ కాస్తా ఇప్పుడు కోటిన్నర లేనిదే కుదరదని ఖచ్చితంగా చెప్పేస్తున్నాట్ట. అంతే మరి, డిమాండ్ వున్నప్పుడే నాలుగు రాళ్ళు లాగేయాలి అనేది సినిమా రంగంలో అసలైన సూత్రం. 'సోల్జర్' తర్వాత ఇంత దాకా మరో చిత్రం రిలీజ్ కాలేదు. దాని ఫలితాన్ని బట్టి ఇప్పటి రేటు కూడా మారుతుంది మరి!

-జె.ఎం.